AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

2-9-2026 (Wednesday) MAIN EDITION

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పంజాగుట్టలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.

## కశ్మీర్‌లో బీజేపీ నాయకుల భారీ నిరసన



**అక్షరటుడే, కశ్మీర్ :** జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన చేపట్టారు. నిరుద్యోగం, అవినీతి ఆరోపణలపై ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా లాల్ చౌక్‌లోని ఘంటా ఘర్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సచివాలయం ముట్టడించానికి ర్యాలీగా బయలు దేరారు. బీజేపీ నిరసన నేపథ్యంలో శ్రీనగర్‌లోని ఘంటా ఘర్, లాల్ చౌక్ నుంచి సివిల్ సెక్రటేరియట్ వరకు భారీ భద్రతను మోహరించారు.

## శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో ఇంట్లో ఏసీబీ సోదాలు



అక్షరటుడే, ఏపీ : తిరుమల శ్రీవారి ఆలయం డిప్యూటీ ఈవో మెండు లోకనాథం ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయింది. తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్లో ఉన్న లోకనాథం ఇంటితో పాటు ఆయన బంధువులు ఇళ్లలో సోదాలు కొనసాగుతున్నాయి.

## క్లోరోక్విన్ మాత్ర వికటించి చిన్నారి మృతి



అక్షరటుడే, ఏపీ : ఏపీలోని పోలవరం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఎటపాక మండలం గొల్ల గుప్ప గ్రామంలో క్లోరోక్విన్ మాత్రలు వికటించి ఓ బాలిక మృతి చెందింది. గ్రామంలో 75 మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. స్పందించిన అధికారులు వారిని ఆస్పత్రులకు తరలించారు.

## జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ..



అక్షరటుడే, హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ జరిగింది. రోడ్డు నెంబర్ 10లో రాజస్థాన్‌కు చెందిన వ్యాపారవేత్త నీల్ కౌర్ నివసిస్తున్నారు. ఆయన ఇంట్లో దుండగుడు చొరబడి భారీగా వజ్రా భరణాలతోపాటు బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. 10 తులాలకుపైగా బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి.

## కాంగ్రెస్ పతనానికి కౌంట్‌డౌన్ : కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలతోనే సాగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని ఆమె మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. హైడ్రా పేరిట పేదల ఇళ్ల కూల్చివేతలు, సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల వరుస మరణాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు, అన్నదాతల బలవన్మరణాలతో పాటు రాష్ట్రంలో రోజురోజుకూ పెరిగిపోతున్న హత్యలు, నేరాలే రేవంత్ రెడ్డి సర్కార్ సాధించిన అసలైన ప్రగతి అని ఆమె విమర్శించారు.

## సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగ సందేశం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రజలకు ఒక భావోద్వేగపూరిత సందేశాన్ని పంపారు. ప్రజల ఆకాంక్షలు, అమరుల త్యాగాల ఆశయాలే తమ ప్రభుత్వానికి ఇంధనంగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. పేదల అవసరాలు, వారి ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తును, యువత ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నట్లు సీఎం వివరించారు.




# ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన

- వెయ్యి రోజుల్లో అన్ని వర్గాలను మోసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ విడుదల

**కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేశారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. తర్వాత ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఛార్జ్‌షీటు విడుదల చేశారు. కాంగ్రెస్ పాలనలో అసమర్థత ప్రోమాక్స్.. అవినీతి అల్ట్రామాక్స్, అరాచకం హైమాక్స్ అని సెటైర్లు వేశారు. రాష్ట్ర సంపదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

ప్రజా పాలన అని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించిందని కేటీఆర్ అన్నారు. వెయ్యి రోజుల పాటు నిలువెత్తు మోసం చేశారన్నారు. వెయ్యి రోజుల పాలన.. ప్రజల పీడన అన్నారు. తెలంగాణ రాష్ట్రం మీద దరిద్రం దండయాత్ర మొదలు పెట్టి నేటితో వెయ్యి రోజులు అయిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ సర్వభ్రష్ట ప్రభుత్వం అని విమర్శించారు. ఈ వెయ్యి రోజులు ఒక క్రిమినల్ వేస్ట్ అని పేర్కొన్నారు.

### ఆర్థిక విధ్వంసం

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని కేటీఆర్ అన్నారు. రైతులను రాచి రంపాన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నిండా ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టో ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం అని కేటీఆర్ అన్నారు. 13 డిక్లరేషన్లు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఉద్యోగులకు ఉత్త చేతులు చూపారన్నారు.

### సామంతుల పాలన

ఇది ఢిల్లీ ముందు మోకరిల్లిన సామంతుల పాలన అని కేటీఆర్ విమర్శించారు. రైతు భరోసా పేరు చెప్పి అన్నదాతలకు పంగనామాలు పెట్టారన్నారు. ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రతి రంగం ధ్వంసమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కానీ కొత్తగా చేసిన పనులు ఏమి లేవని చెప్పారు.

### రైతుల ఆత్మహత్యలు

రూ.41 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. చివరకు రూ.20 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. వెయ్యి రోజుల పాలనలో వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

### ఢిల్లీకి మూటలు..


రాష్ట్రంలో రైతు బంధు బంద్ అయిందని, రాహుల్ బంధు చాలు అయిందన్నారు. రైతుల కడుపు కొట్టి రాహుల్ గాంధీకి డబ్బులు పంపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాహుల్ గాంధీ జేబులు నింపుతున్న దొంగ రేవంత్‌రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్త డ్యామ్‌లు కట్టని ప్రభుత్వం.. మూడు చెక్ డ్యామ్‌లను పేల్చేసిందని విమర్శించారు. సీఎంకు బేషిన్లు తెలియవన్నారు. బూతులు తప్పా.. తెలుగు కూడా సరిగా రాదన్నారు. చంద్రబాబుకు చెంచాగిరి చేయడం మాత్రం తెలుసని ఎద్దేవా చేశారు.



## నేపాల్‌లో మళ్లీ ముంచుకొస్తున్న వరద ముప్పు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌ను మరోసారి వరద ముప్పు భయపెడుతోంది. దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదుల్లో నీటి మట్టాలు ప్రమాదకర స్థాయిని దాటాయి. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలోనూ నీటి మట్టం హెచ్చరిక స్థాయిని మించి ప్రవహిస్తుండడంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది.

## పౌరసత్వంపై అమెరికా కీలక నిర్ణయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని పరిమితం చేసేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యత్నిస్తున్నట్లు సమాచారం. తమ పిల్లల పాస్‌పోర్ట్‌ల కోసం దరఖాస్తు చేసుకునే ముందు అమెరికాలోని తల్లిదండ్రులు తమ పౌరసత్వాన్ని లేదా వలస స్థితిని నిరూపించుకోవాలని ప్రభుత్వం కోరనుంది. 'బర్త్ టూరిజం' అని పిలవబడే దానిని లక్ష్యంగా చేసుకుని పుట్టుకతో వచ్చే పౌరసత్వానికి ఉన్న చారిత్రక మినహాయింపులను విస్తరిస్తూ రిపబ్లికన్ అధ్యక్షుడు ఆగస్టు 6న జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును అమలు చేయడానికి ట్రంప్ బృందం యత్నిస్తోంది. అమెరికా పౌరసత్వం అర్థాన్ని, విలువను ఈ ప్రభుత్వం కాపాడుతుందని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంగా చెప్పారు.



## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ

**అక్షరటుడే, ఢిల్లీ :** రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరు కావాలని కోరారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్ పో-2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం కోరారు. అనంతరం పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు.

## నేపాల్ వరద బాధితులకు సోనూసూద్ సాయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌లో ఆకస్మిక వరదల వల్ల తీవ్రంగా ప్రభావితమైన త్రిశూలి బజార్‌ను బాలీవుడ్ నటుడు సోనూ సూద్ బుధవారం సందర్శించారు. బాధితులకు సహాయక సామగ్రిని పంపిణీ చేయడానికి ఆయన మంగళవారం కాఠ్మండు చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను చూసిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. వినాశనం కళ్ల ముందే కనిపిస్తోందన్నారు. గ్రామంలోని మరో వైపు అంతా తుడిచిపెట్టుకుపోయింది, ఆ ప్రాంతానికి వెళ్లడానికి మార్గం కూడా లేదన్నారు. ఇళ్లు, కుటుంబ సభ్యులను కోల్పోయి ఇక్కడ చిక్కుకుపోయిన వారి గురించి ఆలోచిస్తుంటే తన గుండె తరక్కుపోతుందన్నారు.

## రైతులు, ఉపాధ్యాయులపై కేసులు రద్దు : తమిళనాడు సీఎం



**అక్షరటుడే, తమిళనాడు :** అసెంబ్లీలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కీలక ప్రకటన చేశారు. తమ జీవనోపాధి, హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలిపినందుకు రైతులు, ఉపాధ్యాయులపై మే 2021 నుంచి ఏప్రిల్ 2026 వరకు నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తూ, మానవతా దృక్పథంతో, ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా కేసులు రద్దు చేయాలని నిర్ణయించినట్లు విజయ్ తెలిపారు. తమ ప్రభుత్వం రైతులు, ఉపాధ్యాయులకు అండగా నిలుస్తుందన్నారు.

## కాంగ్రెస్ దాడులపై ఆగ్రహం



**అక్షరటుడే, భువనగిరి :** కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయాలు, నేతల ఇళ్లపై దాడులకు తెగబడటం హేయమైన చర్యని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని హోటల్ వివేరాలో మీడియాతో మాట్లాడిన ఆయన.. తప్పుడు కేసులకు, దాడులకు బీజేపీ కార్యకర్తలు ఎప్పటికీ భయపడరని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలో ఏకంగా జిల్లా పార్టీ అధ్యక్షుడి తల్లిపై దాడి చేయడం అత్యంత సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విరుద్ధంగా బీజేపీపై దాడులకు పాల్పడుతోందని రామచంద్రరావు ఆరోపించారు.